ఆంధ్రప్రదేశ్‌లోనే అదొక సీమ. అక్కడ ఎక్కువగా కొండలూ, బండలూ, అక్కడక్కడ చిట్ట డవులు. అలాటి ప్రాంతంలోని రోడ్డు మీద పరుగెడుతూందా లారీ. రోడ్డు నిర్జనంగా వుండడంతో స్పీడుగానే పరుగెడుతూంది. లారీ బాడీలో లోడు క్యాబిన్‌లో క్లీనర్ కాక ఇద్దరు పాసింజర్లు.

హఠాత్తుగా – "గురూ! అటు చూడు... ఎదురుగా... దూరంలో... రోడ్డు ప్రక్క మనుషులు... వాళ్ళుకాని ఆపమంటే లారీ ఆపెయ్ ఏం?" అన్నాడు క్లీనరు మృదువుగానే – కాని హెచ్చరిస్తున్నట్లు కూడా.




"ఎందుకాపాలి?" కొంచెం చికాకుగా అడిగాడు లారీ డ్రైవర్.

"అది ఇక్కడి ఆనవాయితీ గురూ! నీకు తెలియదు ఈ ప్రాంతం నీకు కొత్త కదా? కార్లు మినహా – లారీలూ, బస్సులూ ఏవైనా – జనం ఎక్కడాపమంటే అక్కడ ఆపితీరాలి."

"లేకపోతే? ఆపకపోతే?" ఎదురుప్రశ్న వేశాడు డ్రైవర్.

"నీకు తెలవదు డ్రైవరూ! ఇక్కడి నేల నిండా రాళ్ళేకాదు, మనుషుల గుండెల్లో కూడా రాళ్లే చాలామందికి. అనవసరంగా ఆనవాయితీ దాటి ఆపద తెచ్చుకోవద్దు. వాళ్ళేం చేస్తారో వాళ్ళకే తెలియదు. చూడబోతే కూలీలలా వున్నారు. వాళ్ళ చేతుల్లో పలుగులూ పారల్లాటివి వున్నాయి–"

క్లీనరు బ్రతిమాలుతున్నట్లన్నా – ఆ మాటలు యువకుడయిన డ్రైవర్‌కి కొంచెం రెచ్చగొడుతున్నట్టే అనిపించాయి.

"వాళ్ళ చేతుల్లో పారలుంటే – నా చేతిలో లారీ వుంది" నవ్వాడు ధీమాగానూ, తేలికగానూ. అతనిలో వేడి రక్తం ప్రవహిస్తోంది మరి. చాలావాటిని లెక్కచెయ్యనిది కదా యవ్వనమంటే?

"నా మాట విను గురూ! వాళ్లు దగ్గర పడుతున్నారు. ఆపు... లేకపోతే..."

"మనమేమీ గాజులు తొడిగించుకుని లేము. వాళ్ళు వొట్టి కూలీలు. నేను పెద్ద లారీ డ్రైవర్ని. కూలీలకే అంత అహమయితే లారీ డ్రైవర్ కింకెంత టెక్కుండాలి? అయినా... ప్రతి అల్లాటప్పాగాడూ, అడ్డమైన వాళ్ళూ ఆపెయ్యమనగానే ఆపెయ్యడానికి... వాళ్ళ చేతులడ్డం పెడితే జీహుజూరని వొంగి సలాములు చేయడానికీ నేనేమైనా పౌరుషం లేనివాడినా, పిరికిపందనా? మనకీ వుందా మాత్రం పొగరు. నేను – వాళ్ళ కోసం లారీ ఆపను" దృడంగానూ, తెగేసినట్లూ చెప్పాడు. ఏమొచ్చినా ఎదుర్కొందుకు సిద్ధమే అన్నట్లుందా దృడకాయుడి కంఠం.

క్లీనరూ, పాసింజర్లూ భయంగా చూస్తూ... దైవం మీద భారం వేసి... గుండెలు బిగబట్టుకు కూర్చున్నారు. అంతలోనే –

"ఆపు... ఆపరా బేవకూఫ్... ఆపవేరా బాదుకోవ్... ఆగరా లండీకొడకా" ఒక్కుమ్మడిగా పది గొంతుకలు. ఆ మనుషులెంత మొరటుగా వున్నారో, వారి కంఠాలంత కరకుగా వున్నాయి. వారి భాష మరీ అసహ్యంగా వుంది. వాళ్ళ చేతుల్లో కనిపించకుండా రాళ్లున్నాయి.

డ్రైవర్ లారీని ఆపలేదు సరికదా... వాళ్ళు సమీపించేసరికి – ఒక్కసారి అతిలాఘవంగా లారీ స్పీడు పెంచి... ముందుకురికించి... వారిని తప్పించి దాటి... క్లీనరువేపు చూసి విజయగర్వంతో విలాసంగా నవ్వాడు. అయితే... అదే క్షణంలో – లారీ మీదకు – వెనుక నుంచి రాళ్ళ వర్షం! ఆపమంటూనూ, లారీ వెనుక పరుగెత్తుకొస్తూనూ, ఆ కూలీలు వేస్తున్న కేకలు. రాయి తగిలి చిటికిన లారీ అద్దం. అయినా లెక్కచెయ్యలేదు డ్రైవర్. "కూలీ చేసుకునే వాళ్ళకే అంత అభిమానమూ, గర్వమూ, పంతమూ ఐతే – లక్షలకొద్దీ విలువచేసే లారీ నడిపే నా కెంత అభిమానమూ, అహంకారమూ వుండాలి?"

పెంచిన వేగం తగ్గిస్తూ అడిగాడు. క్లీనర్‌కాని, పాసింజర్లు కాని ఏమీ అనలేదు – నోరు పెగలనట్లు.

"నేను మంచికీ, మర్యాదకే మనిషిని. దౌర్జన్యంతో నన్ను జయించలేరు–" వెనుక నుంచి రాళ్ళు లారీకి తగలడం లేదుకానీ... ఆ కూలీల కేకలూ, అరుపులూ మాత్రం అస్పష్టంగా వినవొస్తూనే వున్నాయి. వాళ్ళు వెంటాడుతున్నారు నుమా అని సూచన ఇస్తున్నట్టు. వాళ్ళని దాటి యాభై గజాలు పరుగెత్తింది లారీ అప్పటికి.

"నువ్వు అనవసరంగా... గోటితో పోయే దాన్ని గొడ్డలి వరకూ తెచ్చేట్లున్నావు డ్రైవరూ. నువ్వు వాళ్ళ దగ్గర – లారీ ఆపి వుండవలసింది."

"ఎందుకాపాలి?" బింకంగా అడిగాడు డ్రైవర్.

అతని ప్రశ్నకు జవాబూ... అతని లారీకి హద్దూ – ఆ కూలీల ముందు జాగ్రత్తా అన్నిటినీ ఒకేసారి చెప్పింది ఎదురుగా వున్న రోడ్డు. డ్రైవర్ హఠాత్తుగా లారీనాపవలసి వచ్చింది. రోడ్డుకడ్డంగా పెద్ద పెద్ద రాళ్ళు! వాటిని గమనించిన క్లీనరు – లారీ పూర్తిగా ఆగకుండానే – కిందకి ఉరుకుతూ... "వాళ్ళిక్కడికి పరుగెత్తుకొచ్చేలోగా రాళ్ళు జరిపి లారీ పోయేందుకు తోవ చేసుకోకపోయామో మన పని కతమ్... లగేత్తంది...," అరిచాడు అందరికీ హెచ్చరికగా. అంతవరకూ – ముందున్న మువల్ల పండగ తెలిసి భయంతో ముడిచిపెట్టుకు కూర్చున్న ప్రయాణీకులు కూడా లారీలోంచి గెంతారు రోడ్డు మీదకు. "పిరికిపందలు" – తిట్టుకుంటూనే డ్రైవర్ దిగాడు. అందరూ కలసి తోవకడ్డంగా వున్న ఆ బండలను ప్రక్కకి తప్పించాలని, లారీ పోయేందుకు వీలుచేసి ప్రాణాలు దక్కించుకోవాలనీ... శాయశక్తులా ... శక్తి మేరకూ ప్రయత్నించసాగారు. కాని... ఆ బండలు – మమ్మల్ని కదపడమూ, జరగనున్న దానిని తప్పించుకోడమూ మీ తరమా అని వెక్కిరిస్తున్నట్లు– ఒక పట్టాన కదలవే ఎంత బలంగా తోసినా?

అంతలోనే వాళ్ళు వచ్చేశారు – అరుచుకుంటూనూ, చేతుల్లోని పలుగులూ, పారలూ ఊపుకుంటూనూ. వొస్తూనే వాళ్ళు – తమ

# వద్దులే!

కస్టమర్ని అడిగాడు సర్వర్–
"ఇంకేం తేవాలి సార్"
"ఇంకేమీ వద్దు"
"బిల్లు తీసుకురానా?"
"అది కూడా వద్దు"



– కె.వి. మధుసూదనరావు

శత్రువులనొక్కడే అన్నట్టు డ్రైవర్ని చుట్టుముట్టారు. డ్రైవర్ చుట్టూ ఆ పదిమందీ కంచె కట్టేశారు. మానవహారం కట్టేశారు.

ఇదే అదునని క్లీనరూ, పాసింజర్లూ జారుకున్నారు. ఇక మొదలుపెట్టారు కూలీలు డ్రైవర్ మీద దాడి.

"ఏరా తీసఖాఫ్... ఆపకుండా పొయ్యావు?" కాలితో తన్నాడొకడు.

"రోపిడీకి... ఎట్లా కనిపించాంరా నీ కండ్లకు?" చెప్పుతో చెంపమీద కొట్టాడింకొకడు.

డ్రైవర్ ప్రతిఘటించే ప్రయత్నం చెయ్యకపోలేదు. కాని... అది సినిమా ఫైటింగూ కాదు, అతను తెలుగు సినిమా హీరో కాదు. కనుక – పది మంది చేతుల్లోనూ అతను ఫుట్‌బాల్ కాక తప్పలేదు నిముషానికే.

"ఒక అబ్బకే పుట్టినవాడివేరా నువ్వు?" బలవంతంగా డ్రైవర్ నోరు తెరిచి తను అతని నోటిలో ఉమ్మాడింకొక కూలి – కాండ్రించి మరీ.

"బాడుకోవ్... ఆపమంటే ఆపక పొగర్రా నీకు?"

"నువ్వేమయినా లార్డు కరకజ్జానివేటి? లారీ డ్రైవరువిరా సాలా!" జెల్లకొట్టాడు డ్రైవర్‌కి.

"నీయమ్మ... నీ యాలి" బూతులు తిడుతూ – డ్రైవర్‌కి భూమి నవ్వుగా కనిపించేలా గుద్దాడొకడు – ఒక పిడిగుద్దు.

లంజకొడుకు... లండీ కొడుకు... అమ్మ... ఆలి...

డ్రైవర్ని వారి దెబ్బలకంటే తిట్లే ఎక్కువ బాధిస్తున్నాయి. శరీరానికయిన గాయాలకంటే గుండెకైన కోతలే ఎక్కువ. దుర్భరమూ... దుస్సాహసమూ అయిన అవమానం. నిజాని కతని కళ్ళల్లోని నీళ్ళల్లోని అధిక భాగం – అవమానానికే.

"ఇక లారీ ఎక్కి తోలరా తొత్తుకొడకా!" కదలలేదు డ్రైవర్.

"మా కెవరికీ చక్రం తిప్పడం చాతకాక నువ్వు బతికిపొయ్యావ్. లేపోతే నువ్వు జేసిన అవమానానికి నీ ప్రాణాలు తీసి పారేసేవాళ్ళమేగంద?" డ్రైవర్ని లారీలోకి ఎత్తి కుదేసేరిద్దరు. "లారీ నడవకపోయావో నీ పని సరి–"


డ్రైవర్‌కి వాళ్ళ చేతుల్లో చావడం ఎంత మాత్రమూ ఇష్టం లేదు. అదీకాక, వాళ్ళు కొట్టిన దెబ్బలు లారీని నడపనివ్వనంత పెద్దవీ కావు. తన ఇజ్జత్ మీద కొట్టిన దెబ్బలే అతిదారుణం. తన ఇజ్జత్ (గౌరవం... అభిమానం) చాలా దెబ్బతిన్నది.

లారీ నడపసాగాడు. కళ్ళ వెంట నీళ్ళ ధార ఆగడం లేదు. లారీ అద్దాలకైతే ఆటొమాటిక్ వైపర్స్ వున్నాయి. అతని కళ్ళకలాటివి లేనందున ఉండీ ఉండీ చేతులతోనే కన్నీళ్ళని తుడుచుకుంటూ – లారీ నడపసాగాడు.

అమ్మ... ఆలి... బూతులు... తిట్లు... చెప్పు దెబ్బలు... ఉమ్ములు..., వాళ్ళు పది మందీ... తనొక్కడూ.. వాళ్ళొక్కొక్కడూ మోటార్ స్టాఫ్ కంటే మొరటుగా వున్నారు అన్నిటా. ఎంత అవమానించారు ఆ వెధవలు తనని! తను – మనిషే ఐ – ఒక తండ్రికే పుడితే... ఇంత అవమానం భరించి బతికుండకూడదు. కాని... భరించక? బతికుండక? ఏం చెయ్యాలి?

అవమానాన్ని ఆనగించంత సహించనీయని అతని యవ్వనం సమాధానం చెప్పిందతని ప్రశ్నకి. ప్రతీకారం తీర్చుకో. కంటిక కన్ను, రక్తానికి రక్తమూయే కాని – అవమానానికి మాత్రం అవతలి వాడి ప్రాణమే సరి.

నిజమే. కాని... ఎలా? తననవమానించిన వాళ్ళు పది మంది. క్లీనరూ, అంతవరకూ వుండే పాసింజర్లూ కూడా లేక – తనేమో ఒంటరి. వాళ్ళు పది మంది. మొరటు మనుషులు... పైగా వాళ్ళ చేతుల్లో ఆయుధాలు...




తనేమో ఒక్కడూ... నిరాయుధుడూ... ప్రతీకారం తీర్చుకోడం ఎలా?"

మనసుంటే మార్గమే వుండదా? ఆలోచించు. అవకాశం కోసం ఎదురుచూడు. అవమానానికి జవాబు చెప్ప.

"ఏందిర బే? అట్ల నత్తనోలె తోలుతుండవ్? ఇదేమన్న లారీయా, ఎడ్ల బండిర? బేగి తోలర బోసిడీకే."

ఆ మాటలతో... అతని గుండెలోని అవమాన గాయం మరింత కెలకబడి – అగ్నిమీద ఆజ్యం పోసినట్లే మండసాగిందతని గుండె.

వీళ్ళలో – కనీసం ఒక్కడినైనా చంపకుండా తను బతక్కూడదు. తనని తన లారీ ముందే ఘోరంగా అవమానించిన వీళ్ళని... వీళ్ళలో కనీసం ఒకడినయినా తన అవమానానికి బదులుగా బలిచ్చి...

అతనిలో పట్టుదల... పగ... ప్రతీకారం... వాటన్నిటినీ హెచ్చవేస్తూనూ, రెచ్చగొడుతూనూ తానూ వున్నానంటూ ఉడుకురక్తపు యవ్వనం. అవమానంతో బతకడం కంటే ఆత్మహత్య చేసుకుచావడం నయం. ఇజ్జత్ పోయాక ఇన్నానెందుకు?

అతను – ఎదురుగా చూస్తున్నాడు – రోడ్డు వేపే.

కొంచెం దూరం... కొంచెం నిముషాలు... లారీ పరుగెడుతూనే వుంది. నాలుగా రోడ్డు. అటూ ఇటూ అంతు తెలియని అగాధాలు. లోయలు. నిరుద్యోగ శాపవశాత్తూ లారీ డ్రైవరయినా – బి.ఎ. పాసయిన – అతని మెదడులోకి మెరుపులా ఆలోచన. ప్రణాళిక.

అతని కనులలోకి ఒక్కసారి కాంతి. హాయిగా అనిపించే శాంతి. అతని చేతులలో పట్టుదల.

అతను – లారీ నడుపుతూనే – వారి వేపు తిరిగాడు. "ఇందాకా... అక్కడ స్థానబలమూ, సంఖ్యా బలమూ మీది కనుక మీరందరూ ఏకమై నా మీద జులుం చూపి నన్ను దుర్భరమూ, దుస్సహమూ అయిన అవమానాలకు గురిచేశారు. అందుకు నేనిప్పుడు ప్రతీకారం తీర్చుకోబోతున్నాను. మీరందరూ చావడానికి సిద్ధంగా వుండండి" అంటూ లారీ వేగం కొంచెం పెంచాడు.

"నువ్వేం చెయ్యగలవ్ భే?" నన్నాడు ఒక కూలీ అతని మాటలు నమ్మనట్లు.

"లారీని రోడ్డుమీంచి కిందకి లోయలోకి తిప్పేస్తాను. బోల్తా కొట్టించేస్తాను. నన్ను మీరు చేసిన అవమానానికి మిమ్మల్నందర్నీ అలాగే అంతం చేసి ప్రతీకారం తీర్చుకుంటాను."

"అట్లాగయితే నువ్వూ సచ్చిపోతావ్ గందా?" పాయింటు పీకాడొకడు.

"నేను తప్పించుకుందుకు లారీలోంచి సరయిన సమయంలో ఉరికేస్తాను. నిజానికి – నాకు ముఖ్యం – నా ప్రాణం వుండడం కానే కాదు. నన్నవమానించిన మీరందరూ కుక్క చావూ, దిక్కులేని చావూ చావడం. ఎద్దెప్పుడూ ఒకే వేపు పడుకోదు. ఇందాక అవకాశం మీదయితే – ఇప్పుడు అవకాశం నాది. అప్పుడు నా గౌరవమూ, మర్యాదా, అభిమానమూ మీ చేతుల్లో చిక్కితే – ఇప్పుడు మీ ప్రాణాలే చిక్కాయి నా చేతిలో ఏకంగా... దేముణ్ణి చివరిసారిగా ప్రార్థించుకోదలచినవాళ్ళు ప్రార్థించుకోవచ్చు..." వికటంగా నవ్వాడతను, లారీ వేగం మరింత పెంచుతూ.

"వొద్దన్నా... మమ్మల్ని చంపకన్న" ప్రాధేయత.

"బాంచెన్, నీ కాల్మొక్త... బతుకివ్వు దొర" ప్రాణభీతి.

"అది కాదు. జర ఆలోచన చెయ్ దొర –" బ్రతిమాలుడు.

మొండిగా అన్నాడు డ్రైవర్. "మీరిప్పుడేం చెప్పినా... ఎంత మొత్తుకుని ఏడ్చినా ఏమీ లాభం లేదు. ఇందాక నన్ను అనేక విధాల అవమానించి నన్నూ, నాలోని మనిషినీ, మానవత్వాన్నీ, మనసునీ – అన్నిటినీ చంపేసింది మీరే. నన్నవమానించిన మిమ్మల్ని నామరూపాలు లేకుండా, అంతం చెయ్యడమే నా అంతిమ ధ్యేయం". అసలే వాలుగా దిగుతున్న రోడ్డు మీద ఆ లారీ వేగం – విపరీతమయింది. ఒక్కసారిగ అడ్డం తిరిగి – రోడ్డు మీంచి... అంచు మంచి... లోయలోకి... అగాధంలోకి...కూలీల ఏడ్పుల... పెడబొబ్బల... హాహాకారల మధ్య... బోల్తా కొడుతూ... బోర్లాపడుతూ... విలువునా మండిపోతూ చెట్ల మీదుగా... రాళ్ళమీదుగా... దొర్లుతూ... ఆక్రందనల మధ్య... అగ్నికాహుతి ఔతూ... దొర్లిపోతూ... అంతిమ శ్వాసల మధ్య... మంటల ముద్దలా... పెద్ద అగ్నిగోళంలా... అగాధంలోకి... అదృశ్యమయిపోయింది. ఎక్కడో అడుగున భస్మరాశిగానే మిగిలింది. డ్రైవరేమయ్యాడన్నది ప్రశావం కాదు. అతని ప్రతీకారం తీరిందా లేదా అనేదే ప్రస్తుతం. లారీతోపాటే, ఆ పది మంది కూలీలూ కూడా నాశనమయ్యారు నిస్పందేహంగానూ, నిశ్శేషంగానూ.

మరునాటి దినపత్రికలలో – 'ఘోర ప్రమాదం' అని బాక్సులో ప్రచురించబడిందా వార్త. ప్రతీకార వాంఛ కూడా ఒక విధంగా ఘోరప్రమాదమే ఏమో!

– ఇచ్ఛాపురపు రామచంద్రం